www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
28 జూన్ 2025

విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రియగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003

## అంగరంగ వైభవంగా జగన్నాథుని రథయాత్ర

### దేశంలోని వివిధ ప్రాంతాల్లోనూ సాగిన యాత్ర





**భువనేశ్వర్:**
పూరీలోని జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం మంగళహారతి, ఆచార పూజల తర్వాత జగన్నాథుడు నంది ఘోష రథంపై, సుభద్రదేవి దర్పదలన రథంపై, బలభద్రుడు తాళధ్వజ రథంపై ఆసీనులయ్యారు. కొంత దూరం రథాన్ని లాగిన తరువాత నిలిపివేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు పూరి రాజకుటుంబానికి చెందిన గజపతి దివ్య సింగ్ దేవ్ బంగారు చీపురుతో రథం ముందు భాగాన్ని శుభ్రం చేసి రథయాత్రను ప్రారంభించారు. రథాన్ని జగన్నాథుడు తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి 3 కి.మీ. దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేర్చారు. అహ్మదాబాద్ లో శుక్రవారం వేకువజామున 4 గంటలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిచిడిని నైవేద్యంగా సమర్పించారు. సీఎం భూపేంద్ర పటేల్ కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్రను ప్రారంభించారు. అహ్మదాబాద్ రథయాత్ర సందర్భంగా భారీ సంఖ్యలో ఏనుగులను అలంకరించి ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శన సందర్భంగా డప్పుచప్పుళ్లకు ఒక ఐరావతం బెదిరిపోయింది. దీంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఏనుగును నియంత్రించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మణిపూర్ ఇంఫాల్‌లో జరిగే రథయాత్రను కాంగ్ చింగ్బా అని పిలుస్తారు. ఇది మణిపూర్‌లో ఒక ముఖ్యమైన పండుగ. ఇది పూరి రథయాత్రను పోలి ఉంటుంది. రథయాత్ర సందర్భంగా

మిగతా 2 లో

## 'బనకచర్ల' పాపం.. బీఆర్ఎస్ దే



- 'బనకచర్ల' పాపం.. బీఆర్ఎస్ దే
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గోదావరి నదిపై కొన్ని ప్రాజెక్టులు కట్టి ఉంటే బాగుండేది
- గోదావరి నీళ్లు సముద్రంలోకి వెళ్తున్నాయనే సాకుతో ఏపీ రాష్ట్రంలో బనకచర్ల కడుతోంది

2 లో




## మున్సి 'పోల్స్' ఎప్పుడు?

2 లో

- మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు..?
- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- ఎన్నికల నిర్వహణ జాప్యంపై కారణాలు చెప్పాలని ఆదేశం

## దేశ భవిష్యత్ లో ఎంఎస్ఎంఈలదే కీలకపాత్ర

### రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ



కలంజ్యోతి, న్యూ ఢిల్లీ: దేశ ఆర్థిక భవిష్యత్ ను రూపొందించడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఇ)లు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ అన్నారు. సమ్మిళిత ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నాయని అభివర్ణించారు. శుక్రవారం న్యూ ఢిల్లీలో జరిగిన ఎంస్ఎంఈ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశ ఆర్థిక

మిగతా 2 లో

2 కలంజ్యోతి
శనివారం 28.06.2025 General News

# అంగరంగ వైభవంగా జగన్నాథుని రథయాత్ర

మొదటిపేజీ తరువాయి

పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గోవాలో నిర్వహించిన జగన్నాథుడి రథయాత్రలో సీఎం ప్రమోద్ సావంత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ లోని దిఘాలో నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయ్ పూర్ లో నిర్వహించిన రథయాత్రలో మేవార్ రాజ కుటుంబానికి చెందిన ఎమ్మెల్యే విశ్వరాజ్ సింగ్ మేవార్ రథాన్ని లాగారు. రథాన్ని లాగే ముందు ఆలయ సంప్రదాయ ప్రకారం 21 తుపాకులతో వందనం సమర్పించారు. జగన్నాథుడి రథాన్ని 80 కిలోల వెండితో రూపొందించారు. హైదరాబాద్ ఇస్కాన్ ఆలయం నుంచి రథయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రథాన్ని లాగేందుకు పోటీలు పడ్డారు.

**ప్రధాని శుభాకాంక్షలు..**

జగన్నాథుని రథయాత్ర సందర్భంగా దేశ వాసులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వాసం, భక్తితో కూడిన ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శ్రేయస్సు, అదృష్టం, మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలని జగన్నాథుడిని ప్రార్థించారు.




# దేశ భవిష్యత్ లో ఎంఎస్ఎంఈలదే కీలకపాత్ర

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థకు కీలక స్తంభాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. అట్టడుగు స్థాయిలో ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ఎంఎస్ఎంఈలు తక్కువ మూలధన వ్యయంతో పట్టణ, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో అపారమైన ఉద్యోగ అవకాశాలను, సంపదను సృష్టిస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వికేంద్రీకృత వృద్ధి నమూనా సమాజంలోని బలహీన వర్గాలకు శక్తిని, స్థిరమైన ఆర్థిక అభివృద్ధిని చేకూరుస్తుందని చెప్పారు. ఈ రంగాన్ని అభినందిస్తూనే నిత్యం ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ఎత్తిచూపారు. ఆర్థిక లభ్యత, పెద్ద సంస్థల నుంచి గట్టి పోటీ, పాత సాంకేతికత, ముడిపదార్థాల లభ్యత, నైపుణ్యం కలిగిన కార్మికులు లేకపోవడం, పరిమిత మార్కెట్, చెల్లింపులు వంటి జాప్యాలు ఈ రంగానికి అడ్డంకులను అంగీకరించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ రంగానికి ఉన్న ప్రతికూలతలను తొలగిస్తూ పూర్తి సామర్థ్యాన్ని సాధించే దిశగా వీలు కల్పించే నిర్ణయాలకు ఊతం చేకూరుస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో రుణ లభ్యత, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు, పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర పథకాలను వివరించారు. ఈ పథకాల వల్ల దేశంలో ఎంఎస్ఎంఈల సంఖ్య నిరంతరం వేగంగా పెరుగుతుందని, ప్రస్తుతం ప్రోత్సాహకరంగా ఉందని వివరించారు. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగడాన్ని ముర్మూ స్వాగతించారు. దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. యువతులు వ్యాపారాన్ని చేపట్టి స్వావలంభన పొందాలని, నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్రపతి ముర్మూ స్పష్టం చేశారు. పర్యావరణం, గ్రీన్ టెక్నాలజీలను మెరుగుపరిచేందుకు కూడా ఈ రంగం పోటీతత్వంలో స్థిరత్వాన్ని ప్రదర్శిస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ అభినందించారు.

# మున్సి 'పోల్స్' ఎప్పుడు?



**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జరుగుతున్న జాప్యంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆ ఎన్నికలు సకాలంలో ఎందుకు నిర్వహించట్లేదో కారణం తెలపాలంటూ శుక్రవారం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కారణమేంటో తెలపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మందలించింది. పాలకవర్గాలు లేకుండా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని నిలదీసింది. ఎన్నికల నిర్వహణకు జాప్యం ఎందుకు జరుగుతుందో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొంది. రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి 26తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఆ ఎన్నికల నిర్వహణ విషయంలో దాఖలైన పిటిషన్ పై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ జాప్యంపై కారణాలు తెలపాలని ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణ వచ్చే నెల 11వ తేదీకి వాయిదా వేసింది. మరో వైపు మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన హైకోర్టు.. సెప్టెంబర్ 30న ఫలితాలు వెల్లడించాలని డెడ్ లైన్ విధించింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టగా ఇంతలో మున్సిపల్ ఎన్నికల విషయంలో నోటీసులు రావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. దీంతో తాజా పరిణామాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి.

# 'బనకచర్ల' పాపం.. బీఆర్ఎస్ దే



**కలంజ్యోతి, సూర్యాపేట :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గోదావరి నదిపై దేవాదుల, సీతారామ, సీతమ్మధార, సమ్మక్క సారక్క గౌరవెల్లి, తుమ్మిడి హట్టి వంటి ప్రాజెక్టు నిర్మించి ఉంటే నేడు బనకచర్ల వివాదం ఉండేది కాదని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ వైఫల్యం.. అనాలోచిత నిర్ణయాలతో గోదావరి నీళ్లు సముద్రంలోకి వెళ్తున్నాయనే సాకుతో ఏపీ రాష్ట్రంలో బనకచర్ల ప్రాజెక్టు తెరమీదకి తీసుకువచ్చిందన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ గ్రామ సమీపంలోని కృష్ణానదిపై రూ.302 కోట్లతో నిర్మితమవుతున్న జవహర్ జాన్ పహాడ్ లిఫ్ట్ పనులను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడి హట్టి వద్ద డిజైన్ చేసిన బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తిచేసి ఉంటే కేవలం రూ.38వేల కోట్లతో పూర్తయి 17 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. మిగిలిన రూ.62 వేల కోట్లతో కృష్ణ గోదావరి నదులపై ఉన్న అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేవని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల కోసం కాకుండా వారి వ్యక్తిగత ప్రయోజనాలు, కమీషన్ల కోసమే నిర్మించారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ చేసింది వాళ్లే.. కట్టింది వాళ్లే కూలింది కూడా ఆ ప్రభుత్వంలోనే అన్నారు. కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వం తెచ్చిన రూ. లక్ష కోట్ల అప్పుకు తమ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 16 వేల కోట్లు వడ్డీగా కడుతున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన వైఫల్యాలు అన్నిటినీ సరిచేస్తున్నామని తెలిపారు. కృష్ణానది మిగులు జలాలలో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు కేటాయిస్తే అందులో ఆంధ్రకు 512 టీఎంసీలు తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అప్పటి ముఖ్యమంత్రి ఇరిగేషన్ మంత్రి లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి రాసి ఇచ్చారని గుర్తు చేశారు. పంటల సాగుకు ప్రజల అవసరాల కోసం ఆంధ్ర కంటే తమకే ఎక్కువ వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి చెప్పామని ప్రస్తుతం అది పరిశీలన ఉందని చెప్పారు. గత ఖరీఫ్ రబీ సీజన్లో రెండు పంటలు కలిపి రెండు లక్షల 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించిందన్నారు. ధాన్యం అత్యధిక పండించిన రాష్ట్రాలలో నంబర్ వన్ గా తెలంగాణ ఉందని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని మంత్రి చెప్పారు. ఇంత ధాన్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గాని తెలంగాణ రాష్ట్రంలో గాని గతంలో ఎన్నడూ పండలేదని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని మంత్రి ఆరోపించారు. గోబెల్ కి వారసులు వారే అనే చురకలంటించారు. వారి అబద్ధాలు గోబెల్స్ కూడా మించిపోతున్నాయన్నారు. సమావేశంలో ఆయన వెంట ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మాజీ జెడ్పీటీసీ మాలోత్ బుజ్జి మోతిలాల్, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, నేరేడుచర్ల మండల అధ్యక్షులు కోణతం చిన్న వెంకటరెడ్డి, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెల్లం కొండ విజయలక్ష్మి, నరసింహారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, బైరెడ్డి జితేందర్ రెడ్డి, వెంకటి, ముజావర్ జానీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ



**కలం జ్యోతి చెన్నారావుపేట**: గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరం విద్యార్థులు, యువత కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెరువుకొమ్ము తండ లో నిర్వహించిన గిరిజన విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనాన్ని వివిధ శాఖల అధికారులతోనిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నమన్నారు. గిరిజన సంస్కృతి పై నేటి తరానికి అవగాహన ఉండాలన్నారు. గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎంపీడీవో అన్నారు. తాసిల్దార్ మమ్మద్ దిల్వార్ మాట్లాడుతూ.. గిరిజనులు అంటే అందరికీ ఎంతో గౌరవం కలుగుతుందని, సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో చరిత్రను కలిగి ఉన్నాయని చెప్పారు. గిరిజన సాక్ష్యం వైద్యం, ఆరోగ్యం (ఆయుష్మాన్ భారత్) ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) విద్య సౌకర్యాలు మొదలైన వాటిని సద్విని చేసుకోవాలన్నారు.

**రేషన్ కార్డులు :** గిరిజన దరఖాస్తులకు మాత్రమే. అన్ని అవసరమైన ధ్రువపత్రాలు, ఆధర్ పునరుద్ధరణ మరియు పిల్లలకు కొత్త ఆధార్ కోసం క్యాంపులు ఈ ప్రత్యేక అవకాశానికి చివరి తేదీ జూలై 15, 2025 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీఓ శ్రీధర్ రాజ్, మండల వైద్యాధికారి డాక్టర్ సరోజ, ఏపీవో అరుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నెక్కొండ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ మెడికల్ స్టాఫ్ కుండే శివాజీ, ఏఎన్ఎం, ఆశ అంగన్వాడి టీచర్స్, పంచాయతీ సెక్రెటరీ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణగా సఖి కేంద్రం అవగాహన

### జిల్లా కౌన్సిలర్ శైలజ




**కలం జ్యోతి నాగారం:** మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సఖి కేంద్రాల ద్వారా బాధిత స్త్రీలకు అండగా నిలుస్తుందని సూర్యాపేట సఖి కేంద్రం కౌన్సిలర్ శైలజ, కేస్ వర్కర్ పి. భవాని తెలిపారు. శుక్రవారం నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామ పరిధిలోని పత్తి చేలలో పనిచేసే కూలీలకు సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహహింస, వరకట్నం, ప్రజలు పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఆడపిల్లల అమ్మకం, ఆడపిల్లల అక్రమ రవాణా, ఇతరుల నుంచి సమస్యలు ఎదుర్కొనే అతివలు, బాలికలకు భరోసా కల్పిస్తున్నామని కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవసరమైన వారికి పోలీసుల సేవలు, న్యాయపరమైన సేవలు ఉచితంగా అందిస్తూ మహిళలకు భరోసాగా, సలహాదారులుగా ఉంటున్నామని సూచించారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా హెల్ప్ లైన్ నెంబర్ 181 కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. కూలీలు, మహిళలు పాల్గొన్నారు.

# మరోసారి ఆందోళనకు 'జూడా'లు రెడీ

### సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య తీరుకు నిరసనగా నిర్ణయం



**కలంజ్యోతి, హైదరాబాద్:** రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) మరో ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేనట్లయితే జూన్ 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని కాలేజీలలో ధర్నాలు చేస్తామని ప్రకటించారు. స్టైఫండ్ అంశంతో పాటు, అధ్యాపకుల రిక్రూట్ మెంట్, ఇతర సౌకర్యాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల జూడాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. ఆ సమయంలో మంత్రి దామోదర రాజనర్సింహ వారితో చర్చలు జరిపారు. వారి సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు కొన్ని రోజులు ఓపిక పట్టాలని సూచించారు. మంత్రి చర్చలతో జూడాలు శాంతించారు. కానీ సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయాలు, ప్రయత్నాలు లేకపోవడంతో మరోసారి ధర్నాలకు దిగాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందోననే ఆసక్తి నెలకొన్నది.



# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**కలం జ్యోతి,శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి డివిజన్ లోగల ఆదర్శనగర్, ప్రశాంతినగర్, బాపునగర్ లలో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను పరిశీలించడంతో పాటు స్థానికంగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ లో డ్రైనేజ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించమని బస్తీలలో డ్రైనేజీ సమస్య ఉన్న చోట ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిష్కరించాలని, ఆ తర్వాతే సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసి రోడ్డు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెలుకురావాలని అధికారులకు సూచించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ భాస్కర్, మాజీ కౌన్సిలర్ సోమదాస్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, ఆదర్శ్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రమేష్, అశోక్, పవన్ దుర్గా మాత టెంపుల్ కమిటీ మెంబర్స్, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.



# చెన్నారావుపేట రంగాపురం మధ్య పాకాలవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

### కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**కలం జ్యోతి, చెన్నారావుపేట:** రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పాకాల వాగు ఆయకట్టు రైతుల కోరిక నెరవేరుస్తూ శుక్రవారం నాడు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెన్నారావుపేట రంగాపురం మధ్య పాకాల వాగు బ్రిడ్జి నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బండి పద్మ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మజ్జిగ రాంబాబు, చెవ్వ వెంకటేశ్వర్లు,మెంతుల రమేష్, లక్క రాజు తదితరులు పాల్గొన్నారు.





## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే సత్యం

**కలం జ్యోతి , మల్యాల :** మండల కేంద్రంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చేక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మండలంలోని 16 గ్రామాలకు చెందిన 66మంది లబ్ధిదారులకు,ఒక్కరికి రూ: 1,00,116/చొప్పున, మొత్తం రూ: 66,07,656/చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వసంత,బత్తిని మల్లేశ్వరిశ్రీనివాస్ గౌడ్,దొంగ ఆనందరెడ్డి,ముత్యాల రాంలింగారెడ్డి, ముత్యం శంకర్,దారం ఆదిరెడ్డి, శనిగరపు తిరుపతి, వెల్మ లక్ష్మారెడ్డి, తాళ్ల హరినాథ్,సంత ప్రకాశ్ రెడ్డి,ఎండి ఇమామ్,లక్ష్మణ చారి,మిల్ట్రీ శ్రీను,నక్క అనిల్, రామాంజనేయులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి పరామర్శ

### బి ఆర్ఎస్ నాయకులు

**కలం జ్యోతి, చెన్నారావుపేట:** తిమ్మరాయన పహాడ్ గ్రామానికి చెందిన పసునూరి జంపయ్య చనిపోయారని తెలుసుకొని వారిని పరామర్శించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కొండవీటి ప్రదీప్ కుమార్ బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు రెడ్డిమాష్ కిషోర్ సట్టు గిరిబాబు రమేష్ ఎండి అప్సర్ మంద చిన్ను సలీమ్ పాషా చింతల రాములు కొమ్మల కొమరయ్య సింగారపు రమేష్ వడ్లకొండ రవి చింతల చంటి పాల్గొన్నారు

## ఐఏఎంసీకి హైకోర్టు షాక్

- ప్రభుత్వం కేటాయించిన భూములు రద్దు
- రాయదుర్గులో కేటాయించిన మూడున్నర ఎకరాల స్వాధీనానికి ఆదేశం



**కలంజ్యోతి, హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు హైకోర్టు షాకిచ్చింది. ఆ సంస్థకు ప్రభుత్వం కేటాయించిన భూములను శుక్రవారం రద్దు చేసింది. దానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసింది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు హైదరాబాద్ లోని రాయదుర్గ్ లో ఐఏఎంసీ కేంద్రాన్ని అప్పటి సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించారు. సదరు న్యాయసేవా సంస్థకు రాయదుర్గ్ లో మూడున్నర ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రూ.350 కోట్ల విలువైన ఈ భూముల కేటాయింపులు అక్రమంగా జరిగాయంటూ, వాటిని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్ట్ పిటిషన్ దారుల వాదనతో ఏకీభవించి, ఏఐఎంసీకి కేటాయించిన భూములను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది.

# సుజాతనగర్ మండలంలో అభివృద్ధి పనులు





- రూ.1.30 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నాం
- ఎమ్మెల్యే కూనంనేని

**కలం జ్యోతి న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజక వర్గం సుజాతనగర్ మండల పరిధిలో అభివృద్ధి పనుల మహోత్సవం హోట్టహాసంగా జరిగింది. స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబ శివరావు శుక్రవారం ఎనిమిది పంచాయతీల పరిధిలో పూర్తయిన 18 అభివృద్ధి పనులను ప్రారంభించారు,మరో 14 అభివృద్ధి పనులకు ఒక్కరోజే శంకుస్థాపన చేశారు.సర్వారం, కోయ గూడెం,బేతంపూడి, జాష్లూ తండా,పాత అంజనాపురం,కొత్త అంజనాపురం,నర్సింహా సాగర్,సింగభూపాలెం పంచాయతీల పరిధిలో రూ.1.30 కోట్లతో పూర్తయిన రోడ్లు,డ్రైనేజీలు,కల్వర్టులను ప్రారంభించారు,మరో రూ.1.87కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన,ప్రారంబోచ్ఛవ సభల్లో కూనంనేని మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటి పరిస్కారంకోసం కృషి చేస్తున్నామని,ఇప్పటికే 70 శాతం మేర గ్రామీణ ప్రధాన రహదారులు,అంతర్గత రహదారులు పూర్తిచేశామని తెలిపారు.ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక అవసరాలైన త్రాగునీరు, విద్యుత్,వైద్య సౌకర్యం వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు.మండలంలో త్రాగునీటి సమస్య పరిస్కారంకోసం మూడు ప్రాంతాల్లో రూ.1.38కోట్లతో నిర్మించనున్న పంపు హౌస్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని,మరో రూ.30 లక్షలతో పైపు లైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రతి పంచాయతీకి పక్కా భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు వైద్యశాలలను బలోపేతం చేసేందుకు అత్యధిక నిధులు కేటాయిస్తున్న చెప్పారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మితమవుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు,పిఏసిఎస్ చైర్మన్ మండే మనుమంతరావు,తహసీల్దార్ కృష్ణ ప్రసాద్,ఎంపిడివో భారతి,అధికారులు శివయ్య, కిషన్,నర్మద,సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు,కొమారి హేమంతరావు, కొమారి కృష్ణ,జక్కుల రాములు,నాయకులు పొదిలి శ్రీనివాస్,తాళ్లూరి పాపారావు, వేర్ల మల్లేష్,వీర్ల దుర్గాప్రసాద్, మూడు గణేష్,భూక్యా శ్రీను, మేకల వెంకటేష్, ఎర్రం రాజు, సురేష్, రఫీ, బానోత్ అనిల్ నాయక్, నాగేంద్రబాబు,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని సన్మానించిన బానోత్ అనిల్ నాయక్



**కలం జ్యోతి న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలం పరిధిలో జాప్లూతండా సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బానోత్ అనిల్ నాయక్ నివాసానికి విచ్చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబ శివరావు గ్రామంలో ఉన్నటువంటి పలు సమస్యలపై ఎమ్మెల్యేతో ముఖాముఖిగా చర్చించారు. ఆయా సమస్యలను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి బానోత్ అనిల్ నాయక్ దంపతులు ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావుశాలువాతో సన్మానించారు .ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు,కొమారి హేమంతరావు, కొమారి కృష్ణ,జక్కుల రాములు,నాయకులు పొదిలి శ్రీనివాస్,తాళ్లూరి పాపారావు, వేర్ల మల్లేష్,వీర్ల దుర్గాప్రసాద్, మూడు గణేష్,భూక్యా శ్రీను, మేకల వెంకటేష్,ఎర్ణం రాజు, సురేష్,రఫీ,బానోత్ అనిల్ నాయక్,నాగేంద్రబాబు, రాంబాబు,గ్రామ నాయకులు తండా ప్రజలు మాజీ సర్పంచ్లు మాజీ వార్డ్ నెంబర్లు మండల నాయకులు సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు,తదితర పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి

## మంత్రి జూపల్లి




**కలం జ్యోతి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే ప్రధాన లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరిగిందని, దశలవారీగా ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో రైతు భరోసా పథకం 100 శాతం అమలైందని వెల్లడించారు. అలాగే, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయనున్నట్లు వివరించారు. కలెక్టర్ అభిలాష మాట్లాడుతూ, జిల్లాలో అన్ని ప్రభుత్వ పథకాలను అర్హులైన పేద ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వికలాంగుల సౌకర్యార్థం అలిమ్కో సంస్థ ద్వారా రూ. 1.21 కోట్లు విలువ చేసే ఉపకరణాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 2632 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరారన్నారు. వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. ప్రజల భూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభాజాతి చట్టం అమలులో భాగంగా గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా దాదాపు 65 లక్షల మొక్కల నాటేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాపీలను అందజేశారు. అలాగే మహిళా సంఘాలకు రూ. 133 కోట్ల రుణాల చెక్ ను అందజేశారు. డ్రగ్స్, వైద్య ఆరోగ్యశాఖ పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే దివ్యాంగులకు ట్రై సైకిళ్లు మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు కలిసి పంపిణీ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రాంగణం లో ఫుడ్ వేస్టేజ్ కంపోస్టింగ్ యంత్రాన్ని రిబ్బన్ కత్తిరించి మంత్రి ప్రారంభించారు.

ఈ సమావేశంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ల శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పలు పథకాల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



# నన్ను టార్గెట్ చేస్తున్నారు

- మంత్రి సీతక్క
- నన్ను ఎన్నికల్లో ఓడించాలని ఎన్నో శక్తులు పని చేశాయి
- గత పాలనలోనూ ఆదివాసులపై దాడులు జరిగాయి
- అప్పుడు లేని ప్రేమ ఇప్పుడెందుకూ..?
- అడవి బిడ్డలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు

**కలంజ్యోతి, ఏటూరునాగారం :** అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించాలని కుట్రలు పన్నిన కొన్ని శక్తులు మళ్లీ ఇప్పుడు కుయుక్తులు పన్నుతున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. కోయ జాతి మహిళ అయిన తనకు పోర్ట్ ఫోలియో దక్కడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బ తీసేలా తప్పుడు వీడియోలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆదివాసీల విషయంలో మంత్రి సీతక్క స్పందించడం లేదని, జీవో నెంబర్ 49 రద్దు చేయాలని మావోయిస్టుల పేరిట మంత్రి సీతక్కకు జారీ అయిన హెచ్చరిక లేఖపై ఆమె స్పందించారు. ఆ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదని చెప్పారు. మొదట జీవో 49ను వ్యతిరేకించిందే తాను అని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ మంత్రి ఉండి.. పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశమై జీవో 49 ను రద్దు చేయాలని తీర్మాణించినట్లు వివరించారు. ఏ హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా తాను ఆదివాసి అడవి బిడ్డనే అన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసమే తన జీవితం అంకితం అని తెలిపారు. ఆదివాసులకు మేలు చేసేలా అధికారాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. అడవి బిడ్డల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఘటనలు మా దృష్టి రాగానే అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో, ప్రిన్స్ పల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, పీసీసీఎఫ్ సువర్ణతో స్వయంగా మాట్లాడానన్నారు. తన నియోజకర్గంలో కొంతమంది అటవీ అధికారులు ఆదివాసి గుడిసెల మీద దాడి చేశారని తెలిపారు. ఘటన తన దృష్టికి రాగానే అధికారులకు ఫోన్ చేసి వెనక్కి పంపించినట్లు వెల్లడించారు. సొంత నిర్ణయాలతో అధికారులు తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకరిద్దరు అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాలసీల జోలికి వెళ్లడం లేదన్నారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ఆదివాసులపై ఎన్నో సార్లు దాడులు జరిగాయని చెప్పారు. చంటి పిల్లల తల్లులను జైల్లో పెట్టారనీ చెట్లకు కట్టేసి కొట్టారన్నారు. ఇప్పుడు వారిపై లేని ప్రేమ ఒలక బోస్తున్నారని 'మావో'ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మావోయిస్టుల లేఖను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నేతలు తనను అవమానిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు.

# మాటిచ్చి తప్పడం సీఎంకు అలవాటు

- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి
- బీసీ బిల్లు ఆమోదం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళతానని చెప్పి ముఖం చాటేశారు
- ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా బీసీ బిల్లుపై ప్రధాని మోదీతో చర్చించలేదు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాసన మండలిలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ఆయనకు మాట తప్పడం, మడమ తిప్పడం వెన్నతో పెట్టిన విద్య అని చురకలంటించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లు ఆమోదం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళతానని హామీ ఇచ్చిన సీఎం.. మాట తప్పారని ఆరోపించారు. ఢిల్లీకి ఎన్నోసార్లు వెళ్లినా బీసీ బిల్లుపై ప్రధాని మోదీతో ఒక్కసారైనా చర్చించలేదన్నారు. ఢిల్లీకి కప్పం కట్టేందుకే వెళ్తున్నారు తప్ప బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని తేలిపోయిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం ఎన్నోసార్లు మాట తప్పారని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కాకుంటే మంత్రి పొన్నంను కూడా అనుమానించాల్సి వస్తుందన్నారు. పొన్నం ప్రభాకర్‌ను సీఎం బలిపశువు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది మోసాలు, ద్రోహాల చరిత్ర అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి హామీలు ఇవ్వడం వాటిని అమలు చేయకపోవడం అలవాటుగా మారిందని పేర్కొన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తాము సహకరిస్తామన్నా కాంగ్రెస్ ముందుకు రాలేదన్నారు. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్‌కుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె.కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

Cinema కలంజ్యోతి
శనివారం 28.06.2025



# నిధి అగర్వాల్ వింత అలవాటు

తెలుగు చిత్ర పరిశ్రమలో తన అందంతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో నిధి అగర్వాల్ కూడా ఒకరు. సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచమైన నిధి అగర్వాల్, ఆ తర్వాత పలు సినిమాల్లో నటించారు. కానీ నిధి అగర్వాల్ నటించిన సినిమాల్లో రామ్ సరసన చేసిన ఇస్మార్ట్ శంకర్ తప్ప మిగిలినవేవీ తనకు మంచి విజయాల్ని తెచ్చిపెట్టింది లేదు. నిధి కెరీర్లో సక్సెస్ రేట్ తక్కువ ఉన్నప్పటికీ అమ్మడికి స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు బాగానే వస్తున్నాయి. ప్రస్తుతం నిధి చేతిలో రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులున్నాయి. అందులో ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటిస్తున్న హరి హర వీరమల్లు కాగా, రెండోది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన నటిస్తున్న ది రాజా సాబ్. ఈ రెండు సినిమాలపై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఈ రెండు భారీ ప్రాజెక్టులు త్వరలోనే ఆడియన్స్ ముందుకు రానున్నాయి. ఇదిలా ఉంటే నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటారనే విషయం తెలిసిందే. రెగ్యులర్ గా ఏదొక పోస్ట్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకునే నిధి తాజాగా ఎక్స్ లో ఓ పోస్ట్ చేశారు. తనకు ప్రతీ రోజూ రాత్రి మర్డర్ మిస్టరీ సినిమాలు చూసే అలవాటుందని, కొత్త కంటెంట్ దొరకడం లేదని, ప్లీజ్ కొన్ని సినిమాలను చెప్పమని, ఏ భాషైనా పర్లేదని పోస్ట్ చేశారు. నిధి అగర్వాల్ షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, నిధి పోస్ట్ కు నెటిజన్లు క్రేజీ గా కామెంట్స్ చేస్తున్నారు. కాగా నిధి అగర్వాల్ ఇప్పుడు తన కెరీర్లో సరైన బ్రేక్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు తను చేసిన సినిమాలు ఎలా ఉన్నా సరే, తన నుంచి రాబోయే రెండు సినిమాలు మాత్రం ఆడియన్స్ ను అలరించి, పెద్ద సక్సెస్ అవాలని కోరుకుంటున్నారు. ఈ రెండూ సినిమాలూ సక్సెస్ అయితే నిధి కెరీర్ కొత్త మలుపు తిరగడం ఖాయం.